క్లుప్తంగా

'నివేశన స్థలాల సమస్య పరిష్కరించండి'



టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

హుజూరాబాద్‌రూరల్: జర్నలిస్టుల నివేశన స్థలాలకు సంబంధించిన సమస్యను పరిష్కరించాలని హుజూరాబాద్ ప్రెస్ క్లబ్ సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి, వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వం జర్నలిస్టులకు కేసీ క్యాంపులో నివేశన స్థలాలను కేటాయించిందని, భూమికి సంబంధించిన ఎన్‌వోసీ ఇచ్చేలా చూడాలని విన్నవించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని, సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కో–కన్వీనర్లు కాయిత రాములు, నిమ్మటూరు సాయికృష్ణ, అడహక్ కమిటీ సభ్యుడు పోతరాజు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు అప్పగింత

శంకరపట్నం: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసి, బాధితులకు అందించినట్లు ఎస్సై రవి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలంలోని వంకాయగూడెంకు చెందిన భూర్ల వెంకటేశ్ 3 నెలల క్రితం రూ.20 వేల విలువైన, ముత్తారం గ్రామానికి చెందిన కనకం అంజయ్య నెల రోజుల క్రితం రూ.30 వేల విలువైన సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. వారు సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వాటిని రికవరీ చేయగా బాధితులను గురువారం పిలిపించి, అప్పగించామని ఎస్సై పేర్కొన్నారు.

చేప పిల్లలు పంపిణీ



చేపపిల్లలు పంపిణీ చేస్తున్న అధికారులు

శంకరపట్నం: కేశవపట్నం చేపల కేంద్రంలో గురువారం మత్స్యకారులకు చేపపిల్లలు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా చెరువుల్లో 6.73 లక్షల చేపపిల్లలను వదలనున్నట్లు ఇన్‌చార్జి ఎఫ్‌డీవో మంజుల తెలిపారు. మత్స్యశాఖ అధికారులు అశోక్, రాధ, గోపాల్, కృష్ణ, రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

చొప్పదండి: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ చొప్పదండి మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కుటుంబసభ్యులు పట్టభద్రులను స్వయంగా కలిసి, ప్రజా ప్రభుత్వ పథకాలను, పార్టీ సిద్ధాంతాలను వివరించాలన్నారు. వారిని ఓటరుగా నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. అధిష్టానం నిర్ణయించిన అభ్యర్థికి మద్దతు తెలపడంతోపాటు గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చందు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

జమ్మికుంట: బీజేపీ జమ్మికుంట మండల ప్రధాన కార్యదర్శి రామిడి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మడిపల్లిలో పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. మండల అధ్యక్షుడు సంపెల్లి సంపత్‌రావు, సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి ఆకుల రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం



టీకా వేస్తున్న పశువైద్యాధికారి, నాయకులు

చొప్పదండి: క్రిబ్‌కో ఎరువుల కంపెనీ ఆధ్వర్యంలో చాకుంట గ్రామంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. కంపెనీ స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ రామకృష్ణయ్య మాట్లాడుతూ.. రైతులు తెలియక అధిక మోతాదులో ఎరువులు వేస్తే భూసారం దెబ్బతింటుందన్నారు. కచ్చితంగా మట్టి నమూనాలు సేకరించి, చొప్పదండి సహకార సంఘంలో అందిస్తే, మట్టి పరీక్షలు చేసి, ఫలితాలు అందిస్తామని తెలిపారు. పశు వైద్యాధికారి శశికాంత్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులు ఇలాంటి క్యాంపులను సద్వినియోగం చేసుకొని, ఏడాదికి రెండుసార్లు పశువులకు అవసరమైన టీకాలు వేయించాలని సూచించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసిన క్రిబ్‌కో కంపెనీకి సహకార సంఘం చైర్మన్ వెల్మ మల్లారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. క్రిబ్‌కో జిల్లా మేనేజర్ ప్రేమ్‌తేజ్ నాయుడు, సొసైటీ కార్యదర్శి క్లెంం తిరుపతి రెడ్డి, డైరెక్టర్ లంబు రాజిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యం



మానకొండూర్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మానకొండూర్: రైతుల ప్రయోజనాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. మానకొండూర్ మండలంలోని ముంజంపల్లి, మద్దికుంట, వ్యవసాయ మార్కెట్ కమిటీ కెల్లెడ, రంగపేట, పోచంపల్లి, వచ్చునూర్, ఊటూరు, వేగురుపల్లి, లక్ష్మీపూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మానకొండూర్ విశాల సహకార పరపతి సంఘం అధ్యక్షుడు నల్ల గోవింద రెడ్డి, ఊటూరు పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎడ్ల సతీశ్, డీఆర్‌డీవో శ్రీధర్, తహసీల్దార్ రాజేశ్వరీ, ఎంపీడీవో వరలక్ష్మి, ఏపీఎం సంతోష్ పాల్గొన్నారు.

ఈదులగట్టెపల్లిలో మత్తడి పరిశీలన

మానకొండూర్ మండలంలోని ఈదులగట్టెపల్లిలో ఊర చెరువు మత్తడిని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం పరిశీలించారు. ఈదులగట్టెపల్లి స్టేజి నుంచి అన్నారం వరకు తారు రోడ్డు నిర్మాణానికి రూ.4.84 కోట్లు మంజూరైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మత్తడి నీటితో ఇబ్బందులు కలగకుండా పర్మినెంట్ స్ట్రక్చర్ ఏర్పాటు చేసేందుకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీరాజ్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్ ఎస్ఈ లచ్చయ్య, డీఈ రవిప్రకాశ్, ఎంపీడీవో వరలక్ష్మి, తహసీల్దార్ రాజేశ్వరి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఓదెలు, నాయకులు మీస సత్యనారాయణ, రమణ, ప్రభాకర్, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

తిమ్మాపూర్: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండలంలోని గొల్లపల్లి, నేదునూరు, లక్ష్మీదేవిపల్లి, వచ్చునూరు, రాంహనుమాన్‌నగర్, జూగుండ్ల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించారు. రైతుల ప్రయోజనాలే ముఖ్యమని భావించిన ప్రభుత్వం ఆర్థిక భారం ఎంతైనా సరే అని ధాన్యం సేకరిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణ గౌడ్, నాయకులు మామిడి అనిల్, శ్రీనివాస్‌రావు, కృష్ణారెడ్డి, రాజు, లక్ష్మారెడ్డి, సతీశ్, తిరుపతి పాల్గొన్నారు.



తిమ్మాపూర్: కాటమయ్య రక్షణ కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

గీత కార్మికుల సంక్షేమానికి కృషి

గీత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఎల్ఎండీ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో మానకొండూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 250 మంది గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాల కిట్లను గురువారం పంపిణీ చేశారు. నియోజకవర్గంలో మొత్తం 1,600 మంది గీత కార్మికులుండగా, తొలి దశలో 250 మందికి రక్షణ కవచాలు అందించామని, రెండో విడతలో మిగతా వారికి ఇస్తామన్నారు. బీసీ అభివృద్ధి జిల్లా అధికారి ఎం.అనిల్ ప్రకాశ్ మాట్లాడుతూ.. వచ్చే నెల చివరినాటికి గీత కార్మికులందరికీ రక్షణ కవచాలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు సుధగోని లక్ష్మీనారాయణగౌడ్, ఒగ్గె దామోదర్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, పడాల శంకరయ్య, గోపు మల్లారెడ్డి, గోపగోని బస్వాగౌడ్, నోముల అనిల్, ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి పి.శ్రీనివాస్‌రావు, తిమ్మాపూర్ ఎక్సైజ్ సీఐ సాయిబాబా, సిబ్బంది పాల్గొన్నారు.

హుజూరాబాద్ ఠాణాలో ఓపెన్ హౌస్



ఆయుధాల పనితీరుపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

హుజూరాబాద్‌రూరల్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా హుజూరాబాద్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాలలు, ప్రైవేట్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు సుమారు 3 వేల మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి పోలీసులు వాడే వివిధ ఆయుధాల పనితీరు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను ఏసీపీ వివరించారు. ఫిర్యాదులు ఎలా స్వీకరిస్తారు, వాటిపై దర్యాప్తు ఎలా కొనసాగిస్తారు, షీటీం సేవలు, సైబర్ నేరాలు ఎలా జరుగుతున్నాయి, నిరోధించడం ఎలా, వాటిని బారిన పడకుండా ఉండేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం ఎలా అవుతుంది, మత్తు పదార్థాలు తీసుకుంటూ పట్టుబడితే ఎలాంటి శిక్షలు ఉంటాయి, చైల్డ్ ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం, చట్టాన్ని అతిక్రమిస్తే తీసుకునే చర్యలు.. తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

'పోలీస్ అమరుల త్యాగాలు వెలకట్టలేనివి'



రక్తదానం చేస్తున్న సీఐ రవి, సిబ్బంది

జమ్మికుంట: పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని జమ్మికుంట టౌన్ సీఐ రవి అన్నారు. గురువారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా స్పందన బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల కోసం, ప్రజల ప్రాణాలను రక్షించడమే లక్ష్యంగా ఎంతోమంది పోలీసులు విధి నిర్వహణలో తమ ప్రాణాలు కోల్పోయారన్నారు. వారిని స్మరించుకుంటూ ఏటా అక్టోబర్ 21 నుంచి 31 వరకు వారోత్సవాలు నిర్వహిస్తుంచుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం సీఐతోపాటు పోలీస్ సిబ్బంది రక్తదానం చేశారు. పట్టణ యువకులు తదితరులు పాల్గొన్నారు.

రేకొండలో రూ.20 లక్షల పనులు గుర్తింపు



గ్రామసభలో పాల్గొన్న అధికారులు, కూలీలు

చిగురుమామిడి: మండలంలోని రేకొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈజీఎస్ ఆధ్వర్యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. 2025–26వ సంవత్సరానికి గానూ చేపట్టాల్సిన పనులపై చర్చించారు. రూ.20 లక్షల విలువైన పనులు గుర్తించినట్లు గ్రామ ప్రత్యేక అధికారి రమ్యశ్రీ తెలిపారు. రైతులు పశువుల కోసం పాకలు, గొర్రెలు, కోళ్ల కోసం షెడ్లు నిర్మించుకునే అవకాశం ఉందన్నారు. వీటన్నింటికీ ఈజీఎస్‌లో సబ్సిడీ ఉందని తెలిపారు. అంతేకాకుండా, కూరగాయలు, పండ్ల తోటల పెంపకానికీ సబ్సిడీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఈసీ రాజయ్య, టీసీ వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శి గోదరి అజయ్, ఫీల్డ్ అసిస్టెంట్ గోపగోని తిరుపతి, కూలీలు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కోసం ఉద్యమిద్దాం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నరేశ్, నాయకులు

జమ్మికుంట: అనగారిన వర్గాల ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు అనే మౌలిక వసతుల కోసం ఉద్యమిద్దామని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాళ్ల నరేశ్ పిలుపునిచ్చారు. గురువారం జమ్మికుంట పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద వచ్చే నెల 3న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన పార్టీ కార్యకర్తల మహా సమ్మేళనం కరపత్రాలను ఆవిష్కరించి, మాట్లాడారు. పేద ప్రజల కోసం ధర్మసమాజ్ పార్టీ రాజకీయ వేదికగా ఏర్పడిందని, సామాజిక పోరాటానికి సిద్ధమవుతోందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని కోరారు. జిల్లా నాయకులు అన్నారం బాబు, గాజుల రవి, ధర్మ స్టూడెంట్ విభాగం బాధ్యుడు సదానందం, మండల నాయకులు పాల్గొన్నారు.

యూపీఎస్‌ను రద్దు చేయాలి



పోస్టుకార్డుల ద్వారా నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని తపాలా కార్యాలయ ఉద్యోగులు గురువారం పోస్టుల కార్డుల ద్వారా నిరసన తెలిపారు. రాంచీ హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనిఫైడ్ పెన్షన్ సిస్టం(యూపీఎస్), నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం కొనసాగించాలన్నారు. కొత్త వేతనాలు ఇవ్వాలని, గ్రామీణ డాక్ సేవకులకు 8 గంటల పని విధానం అమలు చేయాలని కోరారు. ఆయా అంశాలను పోస్టు కార్డులపై రాసి, ప్రధాన మంత్రికి, ఐటీ, కమ్యూనికేషన్ శాఖ మంత్రికి, పోస్టల్ డైరెక్టర్ జనరల్, కార్యదర్శులకు పంపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలిండియా పోస్ట్ ఎంప్లాయిస్ యూనియన్(గ్రూప్–సీ) రాష్ట్ర అధ్యక్షుడు యు.మహేందర్, బ్రాంచి అధ్యక్షుడు పి.రవికుమార్, గ్రూప్–సీ ఉద్యోగ నాయకులు పి.అమర్నాథ్‌రెడ్డి, సీహెచ్.గోపికిషన్, సీహెచ్.ప్రవీణ్, సందీప్, శ్రీనివాస్, గ్రామీణ డాక్ సేవకుల సంఘం నాయకులు సతీశ్‌కుమార్, స్వామి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులు ప్రారంభం

వీణవంక: బోందుపల్లి గ్రామ పంచాయతీ పరిధి పల్లెలో మంచినీటి పైపులైన్ పనులను ప్రత్యేక అధికారి ఎండీ.నిజామొద్దీన్ గురువారం ప్రారంభించారు. ఇందుకోసం రూ.3 లక్షల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి ఎంపీటీసీ మాజీ సభ్యురాలు చదువు స్వరూప, మాజీ ఉప సర్పంచ్ చదువు జితేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రజిత, నాయకులు బావు సంపత్, రాజ్‌కుమార్ తదితరులున్నారు.

మిత్రుడి కూతురి పేరిట రూ.36 వేలు డిపాజిట్

వీణవంక: మండలంలోని ఎలబాలకు చెందిన మద్దెల రవి ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. అతనితో కలిసి పదోతరగతి చదువుకున్న మిత్రులు బాధిత కుటుంబానికి సాయం చేయాలనుకున్నారు. రూ.36 వేలు పోగు చేసి, రవి కూతురు పేరిట సుకన్య సమృద్ధి యోజన పథకంలో డిపాజిట్ చేశారు. సంబంధిత బాండ్‌ను గురువారం ఆమెకు అందజేశారు.

సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో అధ్యాపకులు

హుజూరాబాద్‌రూరల్: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో జరిగిన కబడ్డీ పోటీల్లో సింగాపూర్ వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి, సౌత్ జోన్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ హనుమకుమార్ తెలిపారు. ఈ నెల 28న చెన్నైలోని ఎస్ఆర్ఎం వర్సిటీలో జరిగే పోటీలకు హాజరవుతారని పేర్కొన్నారు. కళాశాల మేనేజ్‌మెంట్ వొడితెల సతీశ్‌కుమార్, ఇంద్రనీల్, అధ్యాపకులు గురువారం విద్యార్థులను అభినందించారు.

యూనియన్ బ్యాంకు ఖాతా తీసుకోవాలి

చిగురుమామిడి: ప్రతీ ఒక్కరు యూనియన్ బ్యాంకు ఖాతా తీసుకోవాలని, తీసుకున్నవారు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేసుకోవాలని బ్యాంకు చిగురుమామిడి శాఖ మేనేజర్ భాను ప్రకాశ్ కోరారు. గురువారం కొండాపూర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 50 ఏళ్లలోపు ఉన్నవారు ప్రధానమంత్రి జీవనజ్యోతి, 70 ఏళ్లు ఉన్నవారు సురక్ష బీమా యోజన పాలసీలు తీసుకోవాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే రూ.2 లక్షల పరిహారం వస్తుందన్నారు. జీపీ కార్యదర్శి సంపత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనాథలకు నిత్యావసర సరుకులు



సరుకులు ఇస్తున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీనివాస్

హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం అనాథ వృద్ధులు, దివ్యాంగ పిల్లల ఆదరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జన వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని అనాథ వృద్ధులు, దివ్యాంగ పిల్లలకు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ చేతులమీదుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. జన వికాస సంస్థ నిర్వాహకులను ఆయన అభినందించారు. క్లబ్ నిర్వాహకులు రవీందర్‌రావు, మాజీ సర్పంచ్ సంజీవ్, చింత శ్రీనివాస్ తదితరులున్నారు.



ఇల్లందకుంట: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో తహసీల్దార్ కార్యాలయం, శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం ఎదుట రోడ్డుపై చెత్తాచెదారం, వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన వస్తుండటంతో భక్తులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలోని పలు కాలనీల్లోనూ ఇదే పరిస్థితి ఉందని, రోగాలబారిన పడుతున్నామని స్థానికులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆరోపిస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, ఇల్లందకుంట, సెల్ నం : 98496 60330

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9393557752

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న శేఖర్‌రావు

జమ్మికుంట: పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని ట్రస్మా మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు కోరారు. గురువారం జమ్మికుంట పట్టణంలోని పలు పాఠశాలలకు చెందిన పట్టభద్రులతో సమావేశమయ్యారు. తాను ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని, తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. కరోనా సమయంలో అప్పటి ప్రభుత్వ పెద్దలను ఒప్పించి, ప్రైవేట్ టీచర్లకు బియ్యం, రూ.2 వేల ఆర్థికసాయం అందేలా చూశానన్నారు. తనను గెలిపిస్తే పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. ట్రస్మా నాయకులు సంపత్‌రావు, సుధాకర్‌రావు, ప్రతాపరెడ్డి, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, కోమల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బత్తుల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'నాణ్యమైన మాంసం విక్రయించడం లేదు'



కమిషనర్ సమ్మయ్యకు ఫిర్యాదు చేస్తున్న ప్రజాసంఘాల నాయికులు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలో మాంసం విక్రయాల్లో నాణ్యతాప్రమాణాలు పాటించడం లేదని ప్రజాసంఘాల నాయకులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు ఫిర్యాదు చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పరిశీలించి, ధ్రువీకరించిన తర్వాతే విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు రవీందర్, ప్రభాకర్, ఐలయ్య, సతీశ్, సదానందం, వెంకట్రాజం తదితరులున్నారు.

'హలో మాదిగ–చలో జగిత్యాల'కు రండి

రామడుగు: ఈ నెల 27న జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించే హలో మాదిగ–చలో జగిత్యాల ఉమ్మడి జిల్లా సమావేశానికి మాదిగలు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ శంకర్ పిలుపునిచ్చారు. రామడుగు మండలంలోని తిర్మలాపూర్‌లో గురువారం సమితి గ్రామశాఖ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండల ఇన్‌చార్జి తడగొండ త్రినాథ్ వర్మ, నాయకులు శ్రీనివాస్, నర్సయ్య, పోచయ్య, రఘు, పొలు, సూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల ధర్మయుద్ధ మహాసభ విజయవంతం చేయండి

వీణవంక: జగిత్యాలలో ఈ నెల 27న నిర్వహించే మాదిగల ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవునూరి రవీందర్, వీణవంక మండల అధ్యక్షుడు మోరె అరుణ్‌కుమార్ కోరారు. గురువారం వీణవంక మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మూడు నెలలుగా కమిటీ పేరుతో మాదిగలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. వర్గీకరణ అమలు చేయకుండా ఉద్యోగ నియామకాలు చేపట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. జగిత్యాల సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ హాజరవుతున్నారని, మాదిగలు, మాదిగ ఉపకులాల నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబాల మధునయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కండె మహేందర్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్లు అందజేత



చొప్పదండి: చొప్పదండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలురు) విద్యార్థులకు డబ్ల్యూడీడబ్ల్యూఎస్ స్వచ్ఛంద సంస్థ తరఫున గురువారం సైకిళ్లు అందించారు. భూపాలపట్నం, తొగరిమామిడికుంట నుంచి వస్తున్న ఎం.ఝాన్సీ(8వ తరగతి), ఆర్.కృతిక (6వ తరగతి)లకు సైకిళ్లు అందజేశారని హెచ్‌ఎం రాజిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు జమున, ఉపాధ్యాయులు కృష్ణ, లక్ష్మమ్మ, సమత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు సన్మానం



హుజూరాబాద్‌రూరల్: విద్యుత్ ఉద్యోగుల బదిలీల్లో భాగంగా హుజూరాబాద్‌కు వచ్చిన ఉద్యోగులను లైన్‌మెన్‌లు గురువారం సన్మానించారు. హుజూరాబాద్‌రూరల్ సెక్షన్ ఏఈగా జనార్దన్, సబ్ ఇంజినీర్‌గా అభిలాష్ బాధ్యతలు స్వీకరించారు. ఏఈ మాట్లాడుతూ.. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో ఫోర్‌మెన్ సంజీవరావు, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్లు సమ్మయ్య, శ్రీనివాస్, లైన్‌మెన్‌లు రమణారెడ్డి, రజనీకాంత్, శరత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

27న స్వేరోస్ మహాసభ

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద గురువారం రాత్రి స్వేరోస్ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వేరోస్ రాష్ట్ర కన్వీనర్ గడప రాజు మాట్లాడుతూ.. ఈ నెల 27న సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో స్వేరోస్ నేషనల్ కన్వెన్షన్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అన్ని జిల్లాల నుంచి స్వేరో మిత్రులు, మేధావులు, కళాకారులు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కమిటీ సభ్యులు అకినపల్లి ప్రవీణ్, పాక సతీశ్, రామ్‌రాజేశ్వర్, శనిగరం భాస్కర్, మల్లన్న, రవీందర్ తదితరులున్నారు.